
# ౨. సంచిలో ఏనుగు

**నేపథ్యం:**

ప్రశ్న:- పైనున్న రంగు గీతను చెరపకుండా చిన్నది చేయడం ఎలా? జవాబు :- దానికన్నా పెద్ద గీత గీయడమే.
ప్రశ్న :- తివాచీని తొక్కకుండా, దూకకుండా ముందుకెళ్ళడం ఎలా? జవాబు :- తివాచీని చుట్టుకుంటూ వెళ్ళటమే.
దీనినే **సమయస్ఫూర్తి** అంటారు. ఈ పాఠంలో రామకృష్ణుడు సమయస్ఫూర్తితో ఏం చేశాడో చూద్దామా!

ఒక రోజు తెనాలి రామకృష్ణ కవి రాయలవారి సభకు చాలా ఆలస్యంగా వచ్చాడు. రాజుగారు రామకృష్ణుని ఆలస్యంగా ఎందుకు వచ్చావని అడిగారు.



"మహారాజా! నా చిన్న కొడుకు ఈవేళ చాలా మారాం చేశాడు. వాడిని సముదాయించి వచ్చేసరికి ఇంతసేపైంది" అన్నాడు రామకృష్ణుడు. దానికి రాయలవారు ఫక్కున నవ్వారు. "రామకృష్ణా! ఊరకే ఏదోసాకు చెప్పావుగానీ, పిల్లల్ని సముదాయించడం అంత కష్టమా?" అన్నారు.

"లేదు మహారాజా! చిన్న పిల్లలకి నచ్చజెప్పడం అంత సులభం కాదు. దానిని మించిన కష్టమైన పని ఇంకోటి లేదు. అది కావాలి, ఇది కావాలని మారాం చేస్తారు. ఇవ్వకపోతే ఏడుపు లంకించుకుంటారు. గదిమితే ఇంకాస్త రెట్టిస్తారు. ఇవన్నీ వేగడం, వారిని ఊరుకోబెట్టడం అతికష్టం!" అన్నాడు రామకృష్ణుడు.

రాయలవారు దీనికి ఏమాత్రం ఒప్పుకోలేదు పైగా రామకృష్ణుడు కోతలు కోస్తున్నాడని అనుమానించాడు.

"మహారాజా! మీరు అంగీకరిస్తే కొంతసేపు నేను చిన్న పిల్లవాడిగా మారాం చేస్తా. మీరు తండ్రిగా సముదాయించండి. పిల్ల చేష్టలెలా ఉంటాయో మీకు చూపిస్తాను" అన్నాడు రామకృష్ణుడు.

ఓ! దానికే ముంది అలాగే చేద్దామన్నారు శ్రీకృష్ణదేవరాయలు. రామకృష్ణుడు "ఇప్పుడంటే... ఇప్పుడే... మిఠాయి కావాలి అని మొండి పట్టుపట్టాడు.


"ఓస్ ఇంతేగదా! అని మహారాజు వెంటనే మిఠాయి తెప్పించాడు. కొంచెం తిన్నాక బజారు కెళదామని గోల చేశాడు రామకృష్ణుడు. మహారాజు అతన్ని తీసుకొని బజారుకి వెళ్ళాడు.

రామకృష్ణుడు వీధిలో అటూ ఇటూ పరుగెత్తసాగాడు. మహారాజుని కూడా తన వెంట



**సొంతవాక్యాలల్లో ఉపయోగించండి:-** • సముదాయించు • ఫక్కున నవ్వు • అతికష్టం • సతాయించు • కోతలుకోయు

పరుగెత్తించాడు. ఒక కొట్టు ముందు ఆగి రంగు రంగుల సంచి చూపించాడు. దానిని కొనమన్నాడు. రాజు ఆ సంచి కొన్నాడు. ఇంతలో ఒక ఏనుగు కనబడింది. అది కావాలని సతాయించాడు




రామకృష్ణుడు. చేసేది లేక మహారాజు ఆ ఏనుగుని కూడా కొన్నాడు.

అంతటితో ఊరుకోక ఆ ఏనుగుని తను కొన్న సంచిలో పెట్టమన్నాడు రామకృష్ణుడు. ఏనుగు సంచిలో ఎలా పడుతుంది? దానికి బదులు ఇంకేదైనా అడగమన్నాడు రాజు.

అదేం కుదరదు. ఈ ఏనుగును ఈ సంచిలోనే పెట్టాలి. నాకింకే మీ వద్దు''. అని వేధించుకుతిన్నాడు రామకృష్ణుడు. కొంత సేపటికి మహారాజు విసిగిపోయాడు. ఓడిపోయానని ఒప్పుకున్నాడు. రామకృష్ణుడు నవ్వుకున్నాడు.

**ఉక్తలేఖనం:-** ● రామకృష్ణుడు ● కష్టను ● ఒప్పుకొను ● పిల్లచేష్టలు ● మిఠాయి ● శ్రీకృష్ణదేవరాయలు

## I. వినండి-సంభాషించండి.

1. పిల్లలు గొడవ ఎందుకు చేస్తారు?
2. పిల్లలు గొడవ చేస్తే మీరే విధంగా సముదాయిస్తారు?

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### అ. పదజాలం పెంపొందించుకుందాం.

మారాం చేయుట = మొండిపట్టు పట్టుట, మంకుపట్టు పట్టుట;
సముదాయించడం = ఓదార్చడం;
సాకు = నెపము;
లంకించుకొనుట = మొదలు పెట్టుట;
గదుముట = గద్దించుట;
వేగడం = కాలం గడపడం;
కోతలు = గొప్పలు, బడాయి మాటలు;
అంగీకరించుట = ఒప్పుకొనుట;
సతాయించుట = బాధించుట;
విసుగు = చిరాకు;

### ఆ. సరియైన సమాధానానికి వలయం 'o' చుట్టండి.

1. సభకు ఆలస్యంగా వచ్చినది ________
   (అ) మహారాజు (ఆ) మంత్రి
   (ఇ) రామకృష్ణుడు (ఈ) సేనాపతి
2. రామకృష్ణుడు సంచిలో పెట్టమన్నది ________
   (అ) ఏనుగును (ఆ) మిఠాయిని
   (ఇ) పండ్లను (ఈ) బొమ్మలను
3. రామకృష్ణునితో ఓడిపోయానని ఒప్పుకున్నది ________
   (అ) మంత్రి (ఆ) సేనాపతి
   (ఇ) రాజు (ఈ) పిల్లవాడు

### ఇ. ఒక్కొక్క వాక్యంలో సమాధానాలు రాయండి. అవి ఏ పరిచ్ఛేదంలో ఉన్నాయో వాటి సంఖ్య రాయండి.

1. ఆలస్యంగా వచ్చిన రామకృష్ణుడు మహారాజుతో ఏమన్నాడు?
2. రామకృష్ణుడు ఏమని గోల చేశాడు?

3. రామకృష్ణుడు బజారులో ఏమేమి కొనమన్నాడు?

**ఈ. పాఠంలోని మొదటి రెండు పరిచ్ఛేదాలు చదివి ఇచ్చిన కృత్యాలు పూర్తి చేయండి.**

1. కింది వాక్యానికి తగిన విరామ చిహ్నాలు పెట్టండి
   మహారాజా నా చిన్నకొడుకు చాలా మారాం చేశాడు.
2. తప్పు/ఒప్పులను గుర్తించి రాయండి.
   1. రామకృష్ణుడు సభకు తొందరగా వచ్చాడు. ( )
   2. రాయల వారు ఫక్కున నవ్వారు. ( )

**ఉ. మూడు, నాలుగు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**


1. చిన్న పిల్లలకి నచ్చచెప్పడం గురించి మహారాజుతో రామకృష్ణుడేమన్నాడు?
2. రామకృష్ణుడు రాజుని ఏమని సతాయించాడు?
3. రాజు ఓడిపోయానని ఎలా ఒప్పుకున్నాడు?

**ఊ. ఖాళీలను తగిన పదాలతో పూరించండి.**

(విసిగి, ఏనుగుని, ఆలస్యంగా, సులభం)

1. తెనాలి రామకృష్ణకవి సభకు ________ వచ్చాడు.
2. చిన్న పిల్లలకి నచ్చచెప్పడం అంత ________ కాదు
3. ఆ ________ తను కొన్న సంచిలో పెట్టమన్నాడు
4. కొంతసేపటికి మహారాజు ________ పోయాడు.

**భాష–గమ్మత్తు**




## III. భాషావగాహన

**అ. పుట సంఖ్య– 4లోని 4వ, 5వ పరిచ్ఛేదాలు చదివి, వానిలోని భాషాభాగాలు గుర్తించండి**

భాషాభాగాలు

| నామ వాచకం | సర్వనామం | క్రియ | విశేషణం | అవ్యయం |
|---|---|---|---|---|
| | | | | |

ఆ. వ్యతిరేక పదాలు రాయండి.

1. ముందు x ☐
2. చిన్న x ☐
3. కష్టం x ☐
4. పిల్లలు x ☐

**IV. సృజనాత్మకత**

**పాఠంలో రామకృష్ణుడు చేసిన మారాలను నాటకీకరణ చేయండి.**

- మిఠాయి కావాలనటం.
- అటు ఇటు పరుగెత్తించి సంచి కొనమనటం.
- ఏనుగును సంచిలో పెట్టమనటం.

**విభక్తులు:**

రామకృష్ణుడు సభకు ఆలస్యంగా వచ్చాడు.

'సభ', 'ఆలస్యంగా' అనే రెండు పదాల మధ్య ఉన్న సంబంధాన్ని 'కు' అను వర్ణము తెలుపుతున్నది. 'కు' అను వర్ణము లేనట్లయితే పదాల మధ్య సంబంధం మనకు తెలియదు. ఈ విధంగా రెండు పదాల మధ్య సంబంధాలను తెలియజేయు వర్ణములు లేదా వర్ణ సముదాయమును 'విభక్తులు' అని అంటారు.

ఈ విభక్తులు ఎనిమిది రకాలు. అవి

| విభక్తులు | ప్రత్యయాలు |
|---|---|
| ప్రథమా విభక్తి | డు, ము, వు, లు |
| ద్వితీయా విభక్తి | నిన్, నున్, లన్, కూర్చి, గురించి |
| తృతీయా విభక్తి | చేతన్, చేన్, తోడన్, తోన్ |
| చతుర్థీ విభక్తి | కొఱకున్, కై |
| పంచమీ విభక్తి | వలనన్, కంటెన్, పట్టి |
| షష్ఠీ విభక్తి | కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ |
| సప్తమీ విభక్తి | అందున్, నన్ |
| సంబోధన ప్రథమా విభక్తి | ఓ, ఓయి, ఓరి, ఓసి |

కింది వాక్యాలలోని విభక్తులను గుర్తించండి.

1. చిన్న పిల్లలకి నచ్చచెప్పటం అంత సులభం కాదు.
2. మహారాజుని కూడా తనవెంట పరుగెత్తించాడు.
3. వీధిలో అటు ఇటు పరుగెత్తసాగాడు.
4. ఏనుగు సంచిలో ఎలా పడుతుంది.

**నేనివి నేర్చుకున్నా.**



- క్రమ శిక్షణను పాటించాలి.
- సమయం విలువ తెలుసుకోవాలి.
- సమయపాలన (టైం మేనేజ్‌మెంట్) నేర్చుకోవాలి.

YJR1SH